# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## సీఎంల భేటీ రాజకీయం

శ్రీశ్రీ దగ్గర ఎవరో ఆరుద్ర గురించి 'మీ శిష్యరత్నం' అని ప్రస్తావించారట. దానికాయన 'శిష్యుడంటే తను ఒప్పుకోడు.. రత్నమంటే నేను ఒప్పుకోను' అని అన్నారట. చంద్రబాబు-రేవంత్ రెడ్డి అనుబంధం గురించి మాట్లాడుకోవాల్సి వస్తే ఈ చమత్కార సమాధానం సందర్భోచితంగా ఉంటుంది. ప్రస్తుతం రాజకీయంగా ఎన్డీయే, ఇండియా కూటములనే వైరివర్గాల్లో ఉన్నప్పటికీ ఇద్దరి మధ్య సాన్నిహిత్యం జగమెరిగినదే. అంతా రేవంత్ రెడ్డిని చంద్రబాబు శిష్యుడిగా చెప్పుకొంటారు. కానీ, ఆ మాటంటే రేవంత్‌కు కోపం. సాక్షాత్తూ ఓ మీడియా సమావేశంలో ఆయన ఈ పోలికపై చిందులు తొక్కారు. తన అయిష్టతను కొద్దిగా అసభ్యంగా ధ్వనించే భాషలో వెల్లడించారు. 'సహచరులు' అని పిలవాలనేది రేవంత్ కోరిక. ఎలా పిలవాలన్న సంగతిని అలా ఉంచితే ఇద్దరూ గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగానో, నిలువుగానో దొరికిపోయి ఇగిలించారు.

ఇద్దరూ ప్రస్తుతం రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు. రెండు కండ్ల సిద్ధాంతంతో తెలంగాణకు ద్రోహం చేసిన చరిత్ర ఒకరిది. తెలంగాణ ఉద్యమకారులపైకి ఉన్మాదంతో ఉరికిన మరక మరొకరిది. పదేండ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న విభజన సమస్యలపై ఇద్దరూ భేటీ అయ్యారు. మామూలుగా అయితే అధికారుల స్థాయిలో, మంత్రుల స్థాయిలో ఏదైనా ఖరారైతే చివరగా సీఎంలు కలిసి కూర్చుని ఓ ఒప్పందానికి రావాలి. అంతకుమించి ఈ భేటీకి పెద్దగా ప్రాముఖ్యం ఉండదు. కమిటీలు వేయాలని తీర్మానించడానికి ఇంత హంగామా చేయాల్సిన అవసరం లేదు. ఇక్కడ తన సహచరుడు ఉన్నాడన్న ధీమాతో తెలంగాణలో తన ఉనికిని చాటుకునేందుకు జరిపిన ప్రయత్నంగానే చంద్రబాబు పర్యటన కనిపించింది. ఊరేగింపులు, హోర్డింగులతో హోరెత్తించడం, బాబు అనుకూల మీడియా సంబరాలు చేయడమే ఇందుకు సాక్ష్యం. బిచాణా ఎత్తేసి అమరావతికి పరుగుతీసిన బాబు ధోరణిలో తాజాగా వస్తున్న మార్పును తెలంగాణ ప్రజలు గమనించకపోలేదు. ఆయనలో ఎక్కడో, ఏ మూలనో ఆశలు చిగురిస్తున్నట్టున్నాయి. లేకపోతే ఆయన నోట మరోసారి రెండుకండ్ల సిద్ధాంతం వినిపించడం ఏమిటి? తెలంగాణలో పూర్తిగా మూసుకుపోయిన రెండోకన్నును తిరిగి తెరిపించేందుకు ప్రయత్నిస్తానని అనడం ఏమిటి? తెలంగాణలో అంతరించిపోయిన పార్టీ పేరిట ఎన్టీఆర్ భవన్‌లో సమావేశం పెట్టడమేమిటి? ఇక్కడి ప్రజలపై బాబు అధికారంలో ఉన్నప్పుడు సాగించిన అణచివేత గురించి తెలియంది ఎవరికి? చివరి నిమిషంలో తెలంగాణకు అడ్డుపడి ఎందరి ప్రాణాలను బలిగొన్నాడో గుర్తుచేయాల్సిన అవసరం లేదు. అసెంబ్లీలో సైతం తెలంగాణ అనకూడదని శాసించిన సంగతిని సబ్బండవర్గాలు ఇంకా మరిచిపోలేదు. ఆ రోజుల్లో బాబుతో చెట్టపట్టాలు వేసుకుని తిరిగిన రేవంత్‌కు ఇవన్నీ పెద్ద విషయాలు కాకపోవచ్చు. కానీ, తెలంగాణ ప్రజలకు అదొక చీకటి పాలన, నెత్తుటి జ్ఞాపకం. అందుకే ఆయన పార్టీని ఇక్కడ అంటుకు లేకుండా చేశారు.

జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనిస్తే తెలంగాణ వ్యతిరేక శక్తులు మళ్లీ ఒక్కటవుతున్నాయనే విషయం అర్థమవుతున్నది. ఆ శక్తులకు రింగ్ లీడర్‌గా చంద్రబాబు ముందుకు రాజుస్తున్నారు. మరోసారి ఇక్కడి వనరులపై ఆధిపత్యానికి తెరవెనుక కుట్ర ఏదో ఊపిరిపోసుకుంటున్నది. జై తెలంగాణ అనడానికే ఇష్టపడని మనిషి బాబు కోసం ద్వారాలు తెరిచి ఎర్రతివాచీ పరుస్తున్నారు. తెలంగాణ స్వాభిమానానికి, సార్వభౌమాధికారానికి ముప్పు తొంగిచూస్తున్నది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా కాటు వేసేందుకు కాలనాగులు పొంచి చూస్తున్నాయి. తెలంగాణ అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది.

# 'అసాధారణ, అత్యద్భుత అవతార పురుషుడు'

**కొన్నేండ్ల కిందట నేను 'యుగానికొక్కడు' అన్న వ్యాసంలో నారా చంద్రబాబు నాయుడిని శ్రీరాముడు, శ్రీకృష్ణుడితో పోల్చి వారి లాగా ఆయన కూడా ఎటువంటి అవతార పురుషుడో వివరంగా రాశాను. కానీ, బాబు గారు ఈ మధ్య మాట్లాడిన మాటలతో నా అభిప్రాయాలు మారాయి. వారు శ్రీరాముడు, శ్రీకృష్ణుడిలా యుగానికొక్కరు కారు. మన్వంతరాలన్నిటిలో యుగయుగాలకు ఒక్క మనువు పుడతాడని రాశారు, ఆ మనువులు పుట్టుక తీసుకోకముందే ఆత్మల రూపంలో లోకాలన్నింటిని పరిశీలిస్తూ ఉంటారుట. బహుశా అటువంటి ఒక మనువే ప్రపంచాన్ని ఉద్ధరించటానికి నారా వారి రూపంలో అవతరించారు. కోకాపేట భూములు ఎకరం 100 కోట్లు చేయటం మాట కాకుండా, విద్యారంగంలో తెలంగాణ ప్రాంతంలో వారి మహిమలు ఏమిటో విశ్లేషిద్దాం.**



**కనకదుర్గ దంటు**
89772 43484



**1950లో** పుట్టిన చంద్రబాబుకు నిజాం రాష్ట్రం (వేరే దేశం)తో ఆత్మసంబంధం ఉన్నట్టు మనం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే తెలంగాణ ప్రాంతంలో విద్యను తానే ప్రవేశపెట్టానన్నారు. మరి తెలంగాణ విద్యారంగం, సాంస్కృతిక చరిత్రలు పరిశీలిస్తే ఈ వివరాలు తెలుస్తాయి. మొదట పాలించిన నిజాముల కాలంలో అంటే 17, 18 శతాబ్దాలలో పర్షియన్ భాష అధికార భాషగా ఉండబట్టి ఆ భాషా, సాహిత్యాల కోసం విద్యాసంస్థలు ఉండేవి. ఆ మాధ్యమంలోనే 15 ఏండ్ల దాకా మగపిల్లలకు పాఠశాలలు నడపబడేవి. ఆ కాలంలో బహుశా చంద్రబాబు ఆత్మ నిజాముల మస్తిష్కాలలో ప్రవేశించి ఆ పిల్లలకు విద్య గరపమని సలహా ఇచ్చి ఉంటుంది.

ఇక పోనీ ఆంధ్రావారికి మాతృ భాషాభిమానం ఎక్కువ అనుకుంటారు కాబట్టి తెలుగు మాధ్యమంలో పాఠశాలలు వారే స్థాపించారేమో అనుకోవచ్చు. అప్పుడు వారు శ్రీ మాడపాటి హనుమంతరావు ఆత్మలో ప్రవేశించి నారాయణగూడలో 1928లో ఆంధ్ర గర్ల్స్ హైస్కూల్ స్థాపించమని ప్రోత్సహించారు. అంతే, మాడపాటి వారు కేవలం ముగ్గురు విద్యార్థులతో పాఠశాల ప్రారంభించారు. తర్వాతి సంవత్సరం ఎనిమిది మంది విద్యార్థినులకు విద్య గరిపిన ఆ గొప్ప పాఠశాల మాలాంటి వారిని లక్షల మందిని తీర్చిదిద్దింది మాడపాటి. వారికి ప్రోత్సాహమిచ్చిన చంద్రబాబుకు మేమంతా కృతజ్ఞులం.

ఇక అక్కడితో తృప్తి పడలేదు నారా వారు. అంతకంటే ముందు చాదర్‌ఘాట్ పాఠశాల ప్రారంభించటానికి ఆయన ప్రోత్సాహమే పనిచేసింది. ఇది భారతదేశంలో అన్ని పాఠశాలల కంటే మొదటగా ప్రారంభించబడింది. ప్రపంచంలోనే ప్రప్రథమంగా వెలసిన కొన్ని పాఠశాలల చిట్టాలో ఉంటుందీ పాఠశాల. ఈ పాఠశాల మిలిటరీ వారి పిల్లల కోసం ఆంగ్ల మాధ్యమంలో స్థాపించబడింది. ఇంకొక విషయం ఇక్కడ చెప్పటం అవసరం. నిజాముల సైన్యంలో మధ్య ప్రాచ్య దేశాల నుంచే కాకుండా, ఆఫ్రికా దేశాల నుంచి, భారతదేశం నుంచీ కూడా బెటాలియన్లకు సరిపడా సైనికులుండేవారు. ఇప్పుడు హబ్సిగూడ అనే ప్రాంతం అప్పుడు ఆఫ్రికన్ సైనికుల స్థావరంగా ఉండేది. హబ్సి అంటే నల్లవారి జాతి. ఈ తెలివైన పనులన్నీ నిజాముల వల్ల చంద్రబాబు ఆ సమయంలో ప్రధానుల ఆత్మలో దూరి ఇచ్చిన సలహాల వల్లనే జరిగాయి. ఇక 1923లో జాగిర్దార్ కాలేజీగా స్థాపించబడి 1951లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌గా మారిన విద్యాసంస్థ ఇప్పటికీ విజయవంతంగా నడుపబడుతోంది.

ఇక మొట్టమొదటి ఆంగ్ల మాధ్యమంలో సామాన్య ప్రజల పిల్లల కోసం 1834లో పాఠశాల ప్రారంభించబడింది. ఆ తర్వాత డానియేల్ మర్ఫీ అనే ఇంగ్లీషు ప్రచారకుడు 1855లో ఆల్ సెయింట్స్ స్కూల్ ప్రారంభించాడు. ఇప్పుడు ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించినా, ఆ కాలంలో నిజాము ప్రభుత్వంలో ఉన్న విదేశీయులకు అవసరమని గ్రహించిన చంద్రబాబు వీరిని ప్రోత్సహించి ఈ పాఠశాలలు స్థాపింపచేశాడు. పైన చెప్పిన చాదర్‌ఘాట్ స్కూల్ కాలక్రమేణా 1891లో సెయింట్ జార్జి గ్రామర్ స్కూల్‌గా మార్చబడింది. అంటే చంద్రబాబుగా నారా వారి పుట్టుకకు అర్ధ శతాబ్దం ముందు!

ఇక నిజాముల కాలంలో అందరు ప్రధానులలోకి విశిష్టంగా పరిపాలన నడిపినవారు సర్ మీర్ తురాబ్ అలీఖాన్. ఈ పేరు కంటే ఒకటో సాలార్ జంగ్ అంటే అందరికీ తెలుస్తుంది. అత్యంత ప్రభావవంతంగా నిజాము రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన మహా వ్యక్తి. ప్రస్తుతం మనం చూస్తున్న సాలర్‌జంగ్ మ్యూజియంలోని వస్తువులన్నీ ఈయన కుటుంబసభ్యులు సేకరించినవే. 1853 నుంచీ 1883 దాకా ప్రధానమంత్రిగా ఉన్న సాలార్జంగ్-1 అన్నిరంగాలనీ ప్రగతిపథంలో నడిపాడు. బహుశా కేసీఆర్‌కు వారే ఆదర్శమూర్తులేమో! పరిపాలనా సంస్కరణతో పాటు మొట్టమొదటగా ఆధునిక విద్యా సంస్థలను స్థాపించిన ఘనత ఆయనకే దక్కుతుంది. 23 ఏండ్లకు ప్రధానమంత్రి అయిన సాలార్‌జంగ్ అవినీతిమయంగా ఉన్న పాలనను చక్కదిద్దాడు. 1954లోనే దార్-ఉల్-ఉలూమ్ అనే విద్యాసంస్థను ప్రారంభించాడు.

చంద్రబాబు ఆత్మీయ సంబంధం సాలార్జంగ్-1తోనే కాకుండా అతని కొడుకు సాలార్జంగ్-2తో కూడా కొనసాగింది. ఈయన ఇంగ్లండ్ వెళ్లి చదువుకున్నాడు. అందుకని తండ్రి కన్నా ఎక్కువ ఆంగ్ల మాధ్యమాన్ని ఇష్టపడ్డాడు. దారుల్ సలామ్ అనే సంస్థను స్థాపించి, పాశ్చాత్య విద్యా విధానాన్ని ఆ ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశపెట్టాడు. ఆ సంస్థల్లో అరబిక్, ఉర్దూ, ఇంగ్లీషు భాషలను క్షుణ్ణంగా బోధించేవారు. ఆయన స్థాపించిన ఇతర సంస్థలు విశిష్టమైనవి. సిటీ హైస్కూల్స్ (1870), చాదర్‌ఘాట్ హైస్కూల్ (1872), గ్లోరియా గర్ల్స్ హైస్కూల్ (1881). ఇంజినీరింగ్ కాలేజీ (1870) కూడా స్థాపించి ఎంతోమంది సాంకేతిక నిపుణులని తయారుచేశాడు. చంద్రబాబు సహాయం లేకుండా సాంకేతికత ఎలా పెరుగుతుంది చెప్పండి? మన దేశంలోనే కాకుండా విదేశాల నిపుణులను కూడా నారా చంద్రబాబే తయారు చేశారు కదా! మరి తెలివిలేని తెలంగాణలో అటువంటి మేధావి ఆత్మరూపంలోనో, మనిషి రూపంలోనో సహాయం చేయకపోతే తెలంగాణ ప్రాంతం అంతమంది వైద్య, సాంకేతిక నిపుణులని ఎలా తయారుచేసి ఉంటుంది? విశ్వేశ్వరయ్య లాంటి ఇంజినీర్‌ను పిలిచి ట్యాంక్‌బండ్ కట్టించాలనే ఆలోచన నిజాముకి ఎలా కలుగుతుంది, చంద్రబాబు చెప్పకుండా?

*ఇక అక్కడితో తృప్తి పడలేదు నారా వారు. అంతకంటే ముందు చాదర్‌ఘాట్ పాఠశాల ప్రారంభించటానికి ఆయన ప్రోత్సాహమే పనిచేసింది. ఇది భారతదేశంలో అన్ని పాఠశాలల కంటే మొదటగా ప్రారంభించబడింది. ప్రపంచంలోనే ప్రప్రథమంగా వెలసిన కొన్ని పాఠశాలల చిట్టాలో ఉంటుందీ పాఠశాల. ఈ పాఠశాల మిలిటరీ వారి పిల్లల కోసం ఆంగ్ల మాధ్యమంలో స్థాపించబడింది. ఇంకొక విషయం ఇక్కడ చెప్పటం అవసరం. నిజాముల సైన్యంలో మధ్య ప్రాచ్య దేశాల నుంచే కాకుండా, ఆఫ్రికా దేశాల నుంచి, భారతదేశం నుంచీ కూడా బెటాలియన్లకు సరిపడా సైనికులుండేవారు.*

**ఇక ఇప్పుడు ఇక రాష్ట్రం విడిపోయాక కాళేశ్వరం వంటి పథకం ముఖ్యమంత్రి ఎలా ఆలోచించి ఉంటారు? చంద్రబాబు పదే పదే 'తెలంగాణ ఎత్తు మీద ఉంది' అని 'అందుకే నీళ్ళన్నీ ఆంధ్ర వైపు పారతాయని' చెప్పకపోతే కేసీఆర్ ఇలా డిజైన్ చెయ్యాలన్న ఆలోచన అసలు వచ్చేదా? అసెంబ్లీలో తెలంగాణ అన్న పదాన్ని పలకవద్దని నిషేధించకపోతే మరి ఆ పదాన్ని మళ్లీ ఎలా పలకవచ్చు అన్న ఆలోచన, విడి రాష్ట్రమైతేనే సాధ్యం అన్న ఆలోచన అసలు మన కేసీఆర్ చేసేవారా? హైటెక్ చుట్టూ తన వర్గం వాళ్లతో భూములు కొనిపించి, తర్వాత అక్కడ ఐటీ కంపెనీలు పెట్టుకోవడానికి చంద్రబాబు అనుమతినిచ్చాక కదా కేసీఆర్‌కు అర్థమైంది, ఎక్కడ అభివృద్ధి జరుగుతుందో అక్కడే భూముల ధరలు పెరుగుతాయని! అందుకే పట్టుబట్టి కష్టపడి తెలంగాణను అభివృద్ధి చేశారు కేసీఆర్. ఆలోచన మాత్రం చంద్రబాబుదే కదా! ఈ గౌరవం ఆయనకే దక్కుతుంది. ఒక్క ఆలోచన ప్రపంచాన్నే మార్చేస్తుంది అంటారు కదా! కాబట్టి కోకాపేటలో ఎకరం రూ.100 కోట్లకు పెరిగినా, రేపు తెలంగాణ జనాభా 10 కోట్లకు పెరిగినా, ఆ గౌరవం చంద్రబాబుకే దక్కాలి.**

అయితే ఇన్ని చెప్పాక ఒక్కటే సందేహం మిగిలి ఉంది. హైదరాబాద్ ఇంత అభివృద్ధి చేసిన మనిషి ఐదేండ్లలో అమరావతిలో ఒక్క మూడు భవనాలు-శాసనసభ, శాసనమండలి, హైకోర్టు-చక్కగా ఎందుకు కట్టలేక పోయాడూ అని! మరి ఆయన సహాయం లేకుండానే హైదరాబాద్‌లో ఇంద్ర భవనం లాంటి సచివాలయం రెండున్నర ఎకరాల్లోనే వెలిసింది. ఎట్లా అబ్బా! ఏం చిత్రం! నిన్న టీడీపీ ఆఫీసు ప్రసంగంలో ఏపీని బాగుచేసి తెలంగాణకు వస్తాను అన్నారు చంద్రబాబు. ఎంత మహాభాగ్యం? తెలంగాణ మళ్లీ ప్రపంచ పటంలో నిలబడుతుంది అమరావతి లాగా!



**తోటకూర రమేశ్**

# రగులుతున్న నిరుద్యోగులు

**ఉద్యమాల పురిటిగడ్డ అయిన ఓయూలో మరోసారి అగ్గి రాజుకున్నది. ఆర్ట్స్ కాలేజీ వేదికగా నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై జంగ్ సైరన్ మోగించారు. రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు కదం తొక్కారు. దీంతో తెలంగాణ నిప్పుల కుంపటిలా రగులుతున్నది.**



నిరుద్యోగులను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసింది. నిరుద్యోగుల పోరాట ఫలితంగా అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వారిని రోడ్డున పడేశారు. యువతను నమ్మించి తడిగుడ్డతో గొంతుకోశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, తొలి క్యాబినెట్‌లోనే మెగా డీఎస్సీతో పాటు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి.. గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారు. గ్రూప్ 1కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక, గ్రూప్- 2, గ్రూప్- 3 పోస్టుల పెంపు లాంటి కనీస నిర్ణయాలు తీసుకోవడంలోనూ రేవంత్ విఫలమయ్యారు.

**నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకొన్న కోదండరాం, రియాజ్, ఆకునూరి మురళి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు ఇప్పుడు నిరుద్యోగుల పోరాటానికి కనీసం సంఘీభావం ప్రకటించడం లేదు. ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగుల సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి కూడా వారు డుమ్మా కొట్టారు. అంతేకాకుండా, ఉద్యమాలు చేస్తున్నవారిని పెయిడ్ ఆర్టిస్టులంటూ ట్రోల్ చేస్తూ, మహిళలనే గౌరవం కూడా లేకుండా శంకిని అంటూ అవమానిస్తుండటం శోచనీయం.**

తమ గోడు వినాలంటూ లక్షలాది మంది రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నా.. రేవంత్ రెడ్డి సర్కార్‌కు చీమ కుట్టినట్టు కూడా లేదు. వారి డిమాండ్లను పరిష్కరించాల్సిందిపోయి.. ఏకపక్షంగా పరీక్షల తేదీలను ప్రకటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పుండుమీద కారం చల్లుతున్నది. మరోవైపు పదేండ్ల తర్వాత ఉద్యమం నాటి రోదనలతో తెలంగాణ తెల్లారింది. అర్ధరాత్రి వరకు నిరుద్యోగులను అక్రమంగా నిర్బంధించడంపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అక్రమ నిర్బంధాలు ఏమిటని తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులు ఐక్యంగా ఉంటే ప్రమాదమని గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిలో చీలిక తీసుకొచ్చేందుకు విఫలయత్నం చేస్తున్నది. కోదండరామ్ రెడ్డి, బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న, ఆకునూరి తదితరులను అడ్డుపెట్టుకొని.. ఈ పోరాటంలో ముందున్న వారిని ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నది. కానీ, నిరుద్యోగులు అధికార పార్టీ ప్రలోభాలకు లొంగలేదు. 'మీలాగా పదవుల కోసం పాకులాడటం లేద'ని వారికి తెగేసి చెప్పారు. అంతే కాదు, ఈ పోరాటంలో తమతో కలిసి రాకపోతే రేవంత్ రెడ్డి గతంలో చెప్పినట్టు రాళ్లతో కొడుతామని హెచ్చరించారు. తద్వారా తమ పోరాటం ఆగదని చెప్పకనే చెప్పారు.

నిజానికి ప్రజా ఉద్యమాలను చీల్చడం, ఉద్యమకారుల్లో విభేదాలు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమీ కాదు. 1947 నుంచే హస్తం పార్టీ ఇలాంటి కుట్రలు చేస్తున్నది. 1956లో ఏపీలో తెలంగాణను కలపడం దగ్గర నుంచి 1960, 1970లో జరిగిన తెలంగాణ ఉద్యమాన్ని చీల్చడం వరకు కాంగ్రెస్ పార్టీ విజయవంతమైంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలకు పదవుల ఎర వేసి తొలి దశ ఉద్యమాన్ని నీరుగార్చింది. ఆ తర్వాత మలి దశ ఉద్యమంలోనూ అప్పటి టీఆర్ఎస్ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి, నిర్బంధం చేసి, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, పదవుల ఆశ చూపి ఉద్యమ పార్టీని బలహీనపర్చేందుకు కుట్రలు పన్నింది. కానీ, తెలంగాణ ప్రజలు చేసిన పోరాటం ముందు కాంగ్రెస్ కుట్రలు సాగలేదు. ఇప్పుడు కూడా నిరుద్యోగుల పోరాటం ముందు కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలు సాగలేదు. అందుకే కుట్రలు, కుతంత్రాలతో ఇక పని జరగదని గ్రహించిన రేవంత్ సర్కార్ మరో ప్రణాళిక వేసింది. నిరుద్యోగుల పోరాటం మరింత ఉధృతం కాకుండా ఉండాలంటే, పరీక్ష తేదీలను ప్రకటించాలని తద్వారా యువత సన్నద్ధతపై దృష్టి సారిస్తుందని ఇంటెలిజెన్స్ నివేదిక అందడంతో హడావుడిగా తేదీలను ప్రకటించింది.

అసలు రాష్ట్రంలో ఇంత పెద్ద ఉద్యమం జరుగుతున్నా మెయిన్‌స్ట్రీమ్ మీడియా కనీసం పట్టించుకోకపోవడం వెనుక కూడా కుట్ర ఉన్నది. ప్రజాపాలన తీసుకొచ్చామని ఓవైపు చెబుతూనే మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మీడియాపై నియంత్రణ విధించారు. ప్రభుత్వ అనుకూల వార్తలు తప్ప మరే సమస్య గురించి ప్రసారం చేయవద్దని పరోక్షంగా హెచ్చరించారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాను తన గుప్పిట్లో పెట్టుకున్నారు. అందుకే అవి నిరుద్యోగ సమస్యల గురించి ప్రస్తావించడం లేదు. గత నెల రోజులుగా నిరుద్యోగులు పేగులు తెగేలా నిరసనలు చేస్తున్నా, గొంతు ఎండిపోయేలా నినాదాలతో హోరెత్తిస్తున్నా పట్టించుకోవడం లేదు. నిరుద్యోగుల సమస్యే కాదు, ప్రభుత్వ వ్యతిరేక వార్తలేవీ ప్రసారం చేయడం లేదు. రైతుల ఆత్మహత్యల దగ్గర్నుంచి విత్తనాలు, ఎరువులు, రైతుబంధు వరకు ఏదీ ప్రసారం చేయడం లేదు, ప్రచురించడం లేదు. వాటికి బదులు పార్టీ ఫిరాయింపులు, విచారణలు అంటూ హడావుడి చేస్తూ ప్రభుత్వాన్ని జోకుతున్నాయి.

కుట్రలకు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన గాంధీ భవన్ గతంలోనూ ఎన్నో కుట్రలకు వేదికైంది. అదే పరంపర ఇప్పుడూ కొనసాగుతున్నది. ప్రజా ఉద్యమాలను అణచివేయడం, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టడం గాంధీభవన్‌కు మొదటి నుంచి తెలిసిన విద్య. అయితే తెలంగాణకు పోరాటం కొత్త కాదు, అణచివేతలు కొత్తకాదు. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలను ఈ గడ్డ ఎన్నో చూసింది. రేవంత్ రెడ్డి సర్కార్ అహంకారాన్ని నేలకు దించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధమైపోయారు. అందుకు నిరుద్యోగుల పోరే ఆరంభం.



# తొలుత గీత దాటిందే గెలుపు గుర్రం



**నాంచారయ్య మెరుగుమాల**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌గాంధీ 'ప్రజాస్వామ్యంలో జయాపజయాలు ఓ భాగం' అని ఇంగ్లండ్ మాజీ కన్జర్వేటివ్ ప్రధాని రిషి సునాక్‌కు రాసిన లేఖలో వ్యాఖ్యానించడం ఎంతోమందికి ఆశ్చర్యం కలిగించింది. పార్లమెంటేరియన్‌గా 20 ఏండ్ల అనుభవం, సొంత కాంగ్రెస్ పార్టీ రెండు అంతంతమాత్ర విజయాలు, మూడు వరుస పరాజయాల తర్వాత రాహుల్‌కు ప్రజాస్వామ్యంపై ఇంతటి గొప్ప నమ్మకం కుదరడం మంచిదే. కానీ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాతృకగా భావించే బ్రిటన్‌లో 42 ఏండ్ల వయస్సులో ప్రధాని గద్దెనెక్కి 20 మాసాలు పదవిలో కొనసాగిన రిషి సునాక్‌ను ఓదార్చుతూ 54 ఏండ్ల రాహుల్ లేఖ రాయడం కాస్త వింతగా ఉన్నది. రెండు దేశాలకు సంబంధించిన ఒక ఎన్నికల వాస్తవాన్ని ఇక్కడ పరిశీలిద్దాం.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి నెలవైన బ్రిటన్, భారత్‌లో నెల రోజుల తేడాతో వెలువడిన 2024 ఎన్నికల ఫలితాలు ఈ ప్రత్యేక ఎన్నికల ట్రెండ్‌ను సూచిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో వివిధ రాజకీయపక్షాల ఓట్ల శాతానికి, సీట్ల శాతానికి అసలు పొంతన ఉండని సందర్భాలు అనేకం ఉంటాయి. 2004 నుంచి ఇండియాలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో, ఇటీవలి బ్రిటిష్ పార్లమెంట్ దిగువ సభ హౌసాఫ్ కామన్స్ ఎన్నికల్లోనూ 40 శాతం లోపు ఓట్లు సాధించిన ప్రధాన పార్టీలే అధికారంలోకి రావడం లేదా, పాలక కూటమికి నాయకత్వం వహించే స్థితికి ఎదగడం జరిగింది. పూర్వపు యూపీఏ కూటమికి నాయకత్వం వహించిన రెండు సందర్భాల్లో జరిగిన ఎన్నికల్లో (2000, 2004) కాంగ్రెస్ పార్టీ మొత్తం 543 సీట్లకు గాను వరుసగా 145, 206 సీట్లను సాధించింది. మెజారిటీ మార్కుకు ఆమడదూరంలో ఆగిపోయినా కేంద్రంలో కాంగ్రెస్ సంకీర్ణ కూటమి ద్వారా అధికారం హస్తగతమైంది.

ఈ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతం వరుసగా 26.5 శాతం, 28.6 శాతం మాత్రమే. కేవలం 2 శాతం ఓట్ల తేడాతో హస్తం పార్టీ అదనంగా 2009లో 61 సీట్లు గెలుచుకుందంటే దీనికి కారణం అనేకమంది విమర్శించే 'ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్' (ఎఫ్‌పీటీపీ) పద్ధతే కారణం. దీన్నే తెలుగులో 'గెలుపు గీతను మొదట తాకే గుర్రానికే విజయం' అందించే విధానం అని చెప్తుంటారు. ఈ విధానం గుర్రపు పందేలలో అనుసరించే పద్ధతిని పోలి ఉండటం వల్ల ఎఫ్‌పీటీపీ అని పిలుస్తున్నారు.

ప్రపంచంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తల్లిగా పరిగణించే ఇంగ్లండ్ హౌసాఫ్ కామన్స్‌కు జూలై 4న జరిగిన ఎన్నికల్లో 14 ఏండ్లుగా ప్రతిపక్షంగా ఉన్న లేబర్ పార్టీకి కేవలం 34 శాతం ఓట్లతో 63 శాతం సీట్లు (మొత్తం 650కి 412) వచ్చాయి. రెండు శతాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న పాలక కన్జర్వేటివ్ పార్టీ ఈసారి అత్యంత కనిష్ఠంగా 121 సీట్లకు దిగజారింది. ఈ పార్టీ ఓట్ల శాతం 24 ఉన్నా బహుముఖ పోటీల కారణంగా సీట్లను భారీ సంఖ్యలో కోల్పోయింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీకి 43.6 శాతం ఓట్లు వచ్చినా 56 శాతం స్థానాలు (365) మాత్రమే దక్కాయి. పోటీలో అనేక పార్టీల అభ్యర్థులు రంగంలో ఉండటం వల్ల ఇలాంటి ఫలితాలు వస్తాయని చరిత్ర చెప్తున్నది. అలాగే, కొన్ని చిన్న పార్టీలు ఒక ప్రాంతానికే పరిమితమైనా కానీ అక్కడ ఓటర్ల మద్దతు మెండుగా లభిస్తే మొత్తం అవి ఓట్ల శాతానికి సంబంధం లేకుండా ఎక్కువ సీట్లు సంపాదించవచ్చని కూడా బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికలు నిరూపించాయి. దేశవ్యాప్తంగా ప్రజల ఆదరాభిమానాలు తక్కువగా ఉన్న రిఫార్మ్ యూకే పార్టీ 14 శాతం ఓట్లను దక్కించుకొని 5 సీట్లు మాత్రమే తన ఖాతాలో వేసుకోగలిగింది. అలాగే ఈ పార్టీ కన్నా 2 శాతం తక్కువ ఓట్లు (12 శాతం) పొందిన లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ (ఎల్‌డీపీ) 72 సీట్లు కైవసం చేసుకొని సంచలనం సృష్టించింది. ఈ తరహా బహుముఖ పోటీలు జరిగే ఎన్నికల్లో ఎఫ్‌పీటీపీ పద్ధతి పర్యవసానంగా ఓట్లలో ప్రథమ స్థానంలో నిలిచిన పార్టీకే ఓట్ల నిష్పత్తి కన్నా చాలా ఎక్కువగా సీట్లు దక్కుతాయని బ్రిటిష్ కామన్స్ సభ తాజా ఎన్నికల్లో మరోసారి రుజువైంది. విజేతకే అత్యధిక స్థానాలు (విన్నర్-టేక్-ఆల్ పద్ధతి) అనే విధంగా 'గెలుపు గీతను మొదట తాకే గుర్రానికే విజయం' చేకూర్చే విధానమే ఇలాంటి ఫలితాలకు దారి తీస్తున్నది.

**లేఖ**

## నేరాలను అదుపు చేయాలె

వరుస హత్యలతో రాష్ట్రం అట్టుడుకుతున్నది. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ప్రతిరోజూ ఏదో మూలన హత్యలు, మూక దాడులు, దొంగతనాలు, దోపిడిలు జరుగుతుండటం నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయమై ప్రత్యేక దృష్టిసారించి నేరాలను అదుపులో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో గత ఆరేడు నెలలుగా వరుస హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదిలా ఉంటే మద్యం ఆదాయంపై దృష్టిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖకు మంత్రిని నియమించింది కానీ, ప్రభుత్వంలో కీలకమైన, ప్రజలకు రక్షణ కల్పించే హోంశాఖా మంత్రిని నియమించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని వెంటనే హోంమంత్రిని నియమించాలి. అప్పుడే నేరాలకు, హత్యలకు అడ్డుకట్ట పడుతుంది.

**- మ్యాన శ్రీనివాస్, భగత్‌నగర్, కరీంనగర్**

## గుర్తులతో గందరగోళం!

**సార్వత్రిక పోరులో ఎన్నికల గుర్తుల విషయంలో జరిగిన గందరగోళం కారణంగా ఎన్సీపీ (ఎస్పీ) భారీగా నష్టపోయింది. మరీ ముఖ్యంగా బాకా ఊదుతున్న మనిషి, బాకా గుర్తుల పట్ల ఓటర్లలో గందరగోళం నెలకొంది. రానున్న మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో అటువంటి పొరపాటు మరోసారి జరగకుండా చూడాలి. గుర్తులు కేటాయించే విషయంలో ఎన్నికల సంఘం జాగ్రత్తగా వ్యవహరించాలి.**

**- సుప్రియా సూలే,** ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ